ప్రజాశక్తి
మంగళవారం 21 ఫిబ్రవరి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఎమ్మెల్సీ అభ్యర్థిగా సునీత

ఎమ్మెల్యేల కోటాలో మరోసారి అవకాశమిచ్చిన సిఎం జగన్



సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సునీత

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాలకు చెందిన పోతుల సునీతకు వైసిపి అధినేత జగన్ మరోసారి శాసన మండలి సభ్యురాలి పదవికి పోటీ చేసే అవకాశం ఇచ్చారు. మార్చిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలికి జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేల కోటాలో సునీత పోటీ చేయనున్నారు. శాసనసభలో వైసిపికి నూతనంగా ఏడుగురు ఎమ్మెల్సీలను ఎన్నుకునేందుకు కావలసిన సంఖ్యా బలం ఉన్న నేపథ్యంలో పోతుల సునీత గెలుపు లాంఛనంగానే భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండలం, శాంతినగర్‌లో జన్మించిన పోతుల సునీత పరిటాల రవి సన్నిహితుడు పోతుల సురేష్‌ను వివాహం చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన సునీత అలంపూర్ జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓటమిపాలైన పోతుల సునీత 2014 ఎన్నికల్లో ప్రకాశం జిల్లా చీరాల నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత చీరాల టీడీపీ ఇన్‌ఛార్జిగా పని చేసి.. ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి 2017లో ఎమ్మెల్యేల కోటాలో టీడీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పాలనా వికేంద్రీకరణ సీఆర్‌డీఏ రద్దు బిల్లులపై జరిగిన ఓటింగ్‌లో టీడీపీ విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేసి వైసీపీకి మద్దతు తెలిపారు. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2020 అక్టోబర్ 20న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. అనంతరం శాసనమండలికి 2021లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదవీ కాలం ముగియనున్న తరుణంలో మరో సారి వైసిపి తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. చేనేత వర్గానికి చెందిన పోతుల సునీతను బీసీ కేటగిరిలో ఎంపిక చేశారు. సోమవారం తాడేపల్లిలో పార్టీ అధినేత జగన్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు.

పెద్దపులి మిస్టరీ.?



- పులిని చంపి తిన్నారని వదంతులు
- గిరిజనులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్న అటవీ శాఖ అధికారులు
- చంపారనడానికి ఆధారాల్లేవంటున్న డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలంలో అక్కపాలెం అటవీ ప్రాంతంలో పెద్దపులిని గిరిజనులు చంపి తిన్నారన్న వదంతులు గత మూడు రోజులుగా విస్తృతంగా వ్యాపించాయి. పెద్దపులి గ్రామంలోకి వచ్చిన మాట వాస్తవమే అయినా.. అది చనిపోయిందనడానికి గానీ, దాన్ని కొందరు గిరిజనులు చంపి తిన్నారనడానికి గానీ ఎలాంటి ఆధారాలూ లభించలేదు. దీంతో పెద్దపులి విషయం పెద్ద మిస్టరీగా మారింది. పొలాల్లో పెద్దపులి విద్యుత్ తీగలకు తగిలి చనిపోయిందని ఓ ప్రచారం కాగా.. పులిని కొందరు గిరిజనులే చంపి తిన్నారని మరో ప్రచారం ఊపందుకుంది. దీనిపై అటవీ శాఖ అధికారులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. అనుమానం కలిగిన గిరిజనులకు యర్రగొండపాలెం తీసుకువచ్చి పలు రకాలుగా విచారిస్తున్నారు. పొలాలకు పెట్టిన విద్యుత్ తీగల కారణంగా పెద్ద పులి మృతి చెందిందా లేక పథకం ప్రకారం గిరిజనులే పులిని చంపారా.? అసలు పులి చనిపోయిందా? లేదా? అని పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

అక్కపాలెం సమీపంలో పులి సంచరించిన వార్త తెలియడంతో ఈ నెల 10న అటవీశాఖ ఆధ్వర్యంలో పులి అడుగుల సేకరణ చేశారు. ఆడ పులి అని అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో పొలాలకు పెట్టిన విద్యుత్ కారణంగా ఓ కుక్క చనిపోయింది. అదే క్రమంలో ఆ కుక్కను పెంచుకొనే వ్యక్తి 'పక్కా ప్లాను వేసి మొన్న పులిని చంపి తిన్నారు. నేడు నా కుక్కను కూడా చంపారు' అని చేసిన ప్రచారం విస్తృతంగా వ్యాపించింది. ఒక వేళ విద్యుద్ఘాతానికి పెద్ద పులి బలై ఉన్నా.. కొందరు గిరిజనులే పులి మాంసాన్ని తిని ఉన్నా.. మరి ఆ పులి చర్మాన్ని, పులి గోళ్ళను ఏం చేసి ఉంటారనే విషయం చర్చాంశనీయాంశంగా మారింది. దాదాపు పది రోజులు గడిచిన నేపథ్యంలో పెద్దపులి మాంసం కథ అటవీశాఖ అధికారులకు ఎలా అందింది? సమాచారం ఇచ్చిన వారెవరు..? అందులో నిజానిజాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఆరా తీయాలని ▶ 2లో



అటవీ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

సిఎం జగన్‌తో వెంకటేష్ భేటీ

మీ పని తీరు బాగుందని మెచ్చుకున్న ముఖ్యమంత్రి



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ సోమవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ అయ్యారు. స్థానికసంస్థల శాసనమండలి సభ్యుల ఎంపికలను పూర్తి చేసిన జగన్ అభ్యర్థులందరితో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ పోతుల సునీతకు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన జగన్ చీరాలలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పరిశీలకులతో చర్చించిన అనంతరం కరణం వెంకటేష్‌ని తాడేపల్లి రావాలని కబురు చేసినట్లు తెలిసింది. మొన్నటి వరకు చీరాల వైసిపిలో నెలకొన్న గ్రూపు రాజకీయాల కారణంగా మూడు ముక్కలాట వ్యవహారం జరిగింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జిగా పంపారు. చీరాల టిక్కెట్ ఆశిస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీతకు మరోసారి అవకాశం ఇచ్చారు. ఇలా చీరాల వైసిపిలో గ్రూపు రాజకీయాలకు పార్టీ అధిష్టానం స్వస్తి చెప్పినట్లయ్యింది. సోమవారం పోతుల సునీతతో మాట్లాడిన పార్టీ పెద్దలు చీరాల నుంచి పోటీ చేయనున్న కరణం వెంకటేష్ గెలుపునకు కలసి పనిచేయాలని చెప్పినట్లు తెలిసింది. మరో ఆరేళ్ల పాటు ఎమ్మెల్సీగా అవకాశం లభించిన నేపథ్యంలో కరణం వెంకటేష్‌తో కలిసి పని చేస్తానని సునీత హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. సమావేశంలోనే సిఎం జగన్‌ను కలిసిన వెంకటేష్‌తో చీరాలలో అన్ని సమస్యలు తొలగిపోయినట్లేగా అని అడగడంతో 'సమస్యలు ఏమీ లేవని.. అన్నీ పరిష్కరించారుగా..' అని వెంకటేష్ చెప్పారు. 'నియోజకవర్గంలో మీ పనితీరు బాగుంది, అలాగే ముందుకెళ్లండి' అని జగన్ చెప్పారు. ఈ మేరకు త్వరలోనే చీరాలలో కరణం వెంకటేష్, పోతుల సునీతల సంయుక్త సమావేశం జరుగుతుందని తెలుస్తోంది.

నకిలీ ఓటర్లను తొలగించేందుకు చర్యలు

రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించిన జేసీ అభిషిక్త్ కిశోర్

▶ 8లో



మాట్లాడుతున్న జేసీ అభిషిక్త్ కిశోర్

మళ్లీ సీజనల్ వ్యాధులు

- ప్రజలకు జ్వరాలు, జలుబు, గొంతు సమస్యలు
- కరోనా సోకిన సీజన్ కావడంతో ఆందోళన



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వాతావరణంలో మార్పుల ఫలితంగా జనంలో మళ్లీ సీజనల్ వ్యాధులు తీవ్రమవుతున్నాయి. జ్వరాలు, జలుబులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గొంతు సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఎక్కడ చూసినా దగ్గే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. రాత్రి నుంచి ఉదయం వరకు మంచు కూడా అధికంగా ఉంటోంది. ఈ సమయంలో బయటకు వెళ్లిన వారికి ఏదో రకంగా వైరస్ వల్ల జలుబు సోకుతోంది. ప్రస్తుతం జిల్లా అంతటా ఇదే సమస్య కనిపిస్తోంది. ఆసుపత్రులకు పెద్దగా వెళ్లకపోయినా ఈ సమస్యలతో జనం ఇబ్బంది పడుతున్నారు. వైద్యశాఖ వీటిపై దృష్టి సారించాల్సి ఉంది. అయితే సీజనల్‌గా వచ్చే వ్యాధులపై మొదటి నుంచీ వైద్యశాఖ ఉదారంగానే ఉంటోంది. వచ్చి పోతుంటాయనే భావనలోనే ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ వైద్యులే దిక్కవుతున్నారు. అక్కడకు వెళ్లి ఏదో రెండు రకాల మాత్రలు తెచ్చుకుని కాలం గడుపుతున్నారు. విషజ్వరాలు కూడా కనిపిస్తున్నాయి. కరోనా మొదటి దశ, రెండో దశ కూడా గతంలో ఇదే సమయంలో వచ్చాయి. దీంతో గొంతులో సమస్య ఉంటే కొంత ఆందోళన తప్పడం లేదు. కరోనా ఒకటీరెండు దశలూ జనవరి నుంచే తీవ్రమయ్యాయి. ఫిబ్రవరిలో కేసులు భారీగా పెరిగాయి. మార్చిలో అప్పట్లో లాక్‌డౌన్ పెట్టారు. జిల్లాలో డిసెంబర్ నుంచీ కేసులు వచ్చాయి. కరోనా సమయంలో జలుబు చేస్తే గతంలో అందరిలోనూ ఆందోళన ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. దాన్నుంచి జనం బయటపడ్డారు. గతంలో మాదిరిగానే వాతావరణంలో మార్పు వచ్చిందనే చర్చతోనే పోతున్నారు. జలుబుకు సిట్రజన్, ఇతర యాంటీబయాటిక్స్ వేసుకుని ఇళ్ల వద్దనే ఉంటున్నారు. ఆసుపత్రులకు ఇప్పుడు జలుబు, జ్వరాలతో వచ్చేవారి సంఖ్య బాగా తగ్గింది. ఎందుకంటే కరోనా పూర్తిగా పోయిందనే ప్రచారం వచ్చింది. దీని భయం పోయింది. లేకుంటే ఇప్పుడు జనంలో ఉన్న జలుబులు, గొంతు సమస్యలకు ▶ 2లో

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

కమిషనర్‌కు చీరాల సాధన సమితి నాయకుల వినతి

ప్రజాశక్తి-చీరాల

చీరాల దండుబాటు రోడ్డులో మురుగునీటి పారుదల లేక దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చీరాల సాధన సమితి నాయకులు తెలిపారు. దుర్వాసన కారణంగా ప్రజలు అంటువ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తక్షణమే మురునీరు పారుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. చీరాల సాధన సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఏసయ్యను సోమవారం కలిసి సమస్యలను వివరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య పనులను మెరుగుపరిచి మురుగు నీటి పారుదల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దండుబాట నుంచి విజలీపేట రోడ్డుకు వెళ్లే ప్రాంతంలో ఈపూరిపాలెం కాలువలో కలిసే మురుగునీటి కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెల్లచెట్లుతో నిండిపోయి పారుదల నిలిచిపోయినట్లు తెలిపారు. వెంటనే కాలువలో పూడిక తీత పనులు చేయించాలని కోరారు. కారంచేడు రోడ్డులోని మంచినీటి చెరువు ప్రాంతంలో సెప్టిక్ ట్యాంక్ ద్వారా వ్యర్థాలు తీసుకొచ్చి వదులుతున్నారని, అందువల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసయ్య మాట్లాడుతూ మురుగునీటి పారుదల మరమ్మతులు పనులను చేయిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్న కాలువలలో జెసిబి ద్వారా పూడిక తీయించి శుభ్రం చేయిస్తానన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో చీరాల సాధన సమితి సభ్యులు హరిహరరావు, ఊటుకూరు వెంకటేశ్వర్లు, అచ్యుత బాబురావు, తన్నీరు విజయ్, పల్లప్రోలు నాగ మనోహర్, శీలం రవికుమార్, దేవరపల్లి కోటేశ్వరరావు,బహుజన్ సమాజ్ పార్టీ నాయకుడు గొర్రెపాటి రవికుమార్ తదితరులు ఉన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న చీరాల సాధన సమితి నాయకులు

మళ్లీ సీజనల్ వ్యాధులు

(మొదటిపేజీ తరువాయి)

ఇదే భయం ఉంటే పెద్ద సమస్యగా మారేది. పరీక్షల కోసం ఎగబడేవాళ్లు. కరోనా పరీక్షలు కూడా ప్రస్తుతం చేయడం లేదు. వ్యాక్సిన్ కూడా లేదు. వాతావరణంలో వచ్చిన మార్పుల ఫలితంగా ఎక్కువ మంది జలుబు, గొంతు సమస్యలతో బాధపడుతున్నారు. వీటిపై వైద్యశాఖ అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. ఇక వ్యాధులకు కారణాల్లో నీరు కూడా ఒకటి. మనకు ఇచ్చే నీరు ఎంత మేరకు సురక్షితంగా ఉందనేదీ ప్రశ్నార్థకంగా మారింది. సాగర్ కాలువలు, చెరువులు, వాగులు వంకల్లోని నీటిని నీటి పథకాల ద్వారా పంపింగ్ చేస్తున్నారు. దాన్ని సక్రమంగా ఫిల్టర్ చేయడం లేదు. ప్రస్తుతం తాగునీటి పథకాల ఫిల్టర్లు దాదాపుగా అన్నీ పాడైపోయాయి. దర్శి వద్ద పెట్టిన భారీ తాగునీటి పథకాల పిల్టర్లు సక్రమంగా లేవు. అన్ని పథకాల పరిస్థితీ ఇదే. నిధులు లేనందున వాటిని ఎప్పటికప్పుడు రిపేర్లు చేయడం లేదు. వచ్చే నీటిని యధాతథంగా పంపింగు చేసి గ్రామాలకు పంపుతున్నారు. నీళ్ల చాలా చోట్ల మురికిగా రంగు మారి కనిపిస్తున్నాయి. ఈ నీటిని కాచితాగితే తప్ప.. యధాతథంగా తాగితే జబ్బులు ఖాయం. ఒంగోలులోనే తాగునీటి పైపులైన్లు మురుగుకాలువల్లో ఉన్నాయి. కాసేపు మురుగునీరే వస్తోంది. తర్వాత మంచినీళ్లు పట్టుకుంటారు. ఇవి కూడా కలుషితంగానే ఉంటున్నాయి. ఇలా తాగునీటి పథకాల నుంచి వచ్చే నీరు కలుషితంగానే ఉంటోంది. డబ్బాల్లో నీటిని కొందరు తాగుతున్నారు. దాంట్లోనూ ఫ్లోరిన్ శాతం అధికంగా ఉంటోంది. నాణ్యత లేని కంపెనీలు జనానికి నీటిని అంటగడుతున్నాయి. వాటి పైనా నిఘా లేదు. ఇలా నీటి వల్లనూ రోగాలు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా వైద్యశాఖ ఆసుపత్రులకు వచ్చే రోగులపై అధ్యయనం చేయాల్సి ఉంది. సీజనల్ వ్యాధులను ముందుగానే నియంత్రించే చర్యలు చేపట్టాలి.

'పెద్ద' పులి మిస్టరీ.?

(మొదటిపేజీ తరువాయి)

అక్కపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

విచారణ పేరుతో ఇబ్బందులు

పులిని చంపామనే ఆరోపణలతో తమను విచారణ పేరుతో అటవీ శాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని గిరిజనులు వాపోతున్నారు. శివరాత్రి పండుగ రోజు కూడా తమ ఇళ్లల్లో సోదాలు చేశారని కన్నీంత పర్యంతమవుతున్నారు. ఎవరో చెప్పిన గాలి వార్తలు విని తమని ఇబ్బంది పెట్టడం సరికాదంటున్నారు. ఎవరో చెప్పిన గాలి వార్తలు విని మమ్మల్ని ఇబ్బంది పెట్టడం సరి కాదంటున్నారు. విచారణ పేరుతో తెచ్చి వదిలి పెట్టక పోవడంతో చంటి పిల్లలు బెంగతో డుస్తున్నారని తెలిపారు.

ఎలాంటి ఆధారాలూ లేవు

డి.రామ్మోహన్‌రావు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్, పుల్లలచెరువు



అక్కపాలెం ప్రాంతంలో పులి సంచరించిందని తెలియడంతో దాని ఆచూకీ తెలుసుకునేందుకు అదే రోజు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశాం. సమీప గ్రామాలకు రాత్రి పూట విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పాటు ప్రజలు ఆరు బయట నిద్రపోవద్దని చాటింపు వేయించాం. విద్యుత్ కంచె తగిలి పులి మత్యువాత పడినట్లు తెలియడంతో విచారణ చేపట్టాం. ఈ విషయాలు మొత్తం ఉన్నతాధికారులకు తెలియజేశాం. పులిని చంపారనడంలో ఎలాంటి ఆధారాలు దొరకలేదు.

అప్పికట్లలో రథోత్సవం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని అప్పికట్ల గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. రథంపై శ్రీగంగా అన్నపూర్ణ విశాలాక్ష్మి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఉంచి రథోత్సం నిర్వహించారు. ఆలయ ధర్మ కర్తల మండలి సభ్యులు రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం అనంతరం అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ కుర్రా రాంబాబు,సర్పంచి గుత్తికొండ రజిని రాజేశ్, ఆలయ ఇఒ వీరా రెడ్డి, ఇనగంటి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి- కొత్తపట్నం

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని మడనూరు, ఈతముక్కల గ్రామాల్లో రథోత్సవం అంగరంగ వైభవం సోమవారం రథోత్సవం నిర్వహించారు. తొలుత రథం ముందు ఆలయ వంశ పారంపర్య ఆగమన కర్త కొంపల్లివీరభద్రరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ గంగా పర్వతవర్ధిని సమేత మలింగేశ్వర స్వామి,శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ కన్నేశ్వరశ్వమి, జ్వాలాముఖ అమ్మవారిని రథంపై ఉంచారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రనీత్ రెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం సందర్భంగా మడనూరు పురవీధుల్లో శివనామ స్మరణ మారుమోగింది. అనంతరం రథోత్సవం ఈతముక్కలకు చేరింది. రథోతవ్సం సందర్భంగా ఒంగోలు డిఎస్‌పి నాగరాజు ఆధ్వర్యంలో టూటౌన్ సిఐ రాఘవరావు, కొత్తపట్నం ఎస్ఐ మధుసూదనరావు గట్టి బందబస్తు నీర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రమణారెడ్డి, సర్పంచి కోటేశ్వరరావు, ఎంపిపి అంజిరెడ్డి, రవీంద్రారెడ్డి, ప్రమోదరెడ్డి, వీరారెడ్డి, మల్లారెడ్డి, ఎంపిడిఒ సుజాత తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో నాయకులు

టిడిపి నాయకుడు కెవిఆర్ మృతి

ప్రజాశక్తి - పంగులూరు

టిడిపి నాయకులు ,చిన్న మల్లవరం గ్రామ మాజీ సర్పంచి కొండ్రగుంట గోవిందమ్మ భర్త వెంకటేశ్వరరావు(86) గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మల్లవరం గ్రామ ప్రజలు వెంకటేశ్వర రావును కెవిఆర్ అని ఎంతో అభిమానంగా పిలుచుకుంటారు. డిగ్రీ చదివిన వెంకటేశ్వరరావు మొదటి నుంచి ప్రజల పట్ల అభిమానంగా ఉండేవారు. టిడిపి అభిమానిగా, కార్యకర్తగా పనిచేశారు. వెంకటేశ్వరావు భార్య గోవిందమ్మ చిన్న మల్లవరం గ్రామ సర్పంచిగా భపనిచేశారు. ఆమె కాలంలో సిమెంట్ రోడ్లు నిర్మించి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వద్ధాప్యం రీత్యా ఇటీవల కొంత అనారోగ్యానికి గురైన వెంకటేశ్వరరావు ఆదివారం మరణించారు .ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వెంకటరమణ దొడ్ల డైరీ ఉమ్మడి ప్రకాశం జిల్లా డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నారు. వెంకటేశ్వర రావు మృతదేహాన్ని ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్, మాజీ జడ్‌పిటిసి బాచిన చెంచు ప్రసాద్,డెయిరీ మాజీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, సిపిఎం రాష్ట్ర నాయకులు రంగారావు, టిడిపి నాయకులు, అభిమానులు సందర్శించి నివాళు లర్పించారు.



వెంకటేశ్వరరావు (ఫైల్)



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మండల పరిధిలోని పేర్నమిట్ట బివిసుబ్బయ్య హైస్కూల్‌లో 1990-91 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒక్కొరినొక్కరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి మధుర స్మతులను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు.అనంతరం అప్పట్లో తమకు విద్యనందించిన ఉపాధ్యాయులు నల్లూరి కష్ణారావు, కెవి. శేషయ్య, ఆర్, చౌదరి, జి. మోహనరావు, ఎం. గోవర్ధన్, ఎస్‌వి. కష్ణారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొడ్డు కోట్లింగం, ప్రధానోపాధ్యాయుడు వై. వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యాయుడు ఎం. కొండలరావు, పూర్వ విద్యార్థులు ఆరికట్ల శ్రీనివాసరావు , ఈదర విష్ణువర్ధన్, వి. మనోహర్ రెడ్డి, వి. హనుమంతరావు, ఎం.హరిబాబు, జి.సుబ్బారావు, పి. గంగాధర్, పి.చంద్రశేఖర్, టి. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకోవాలి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పిల్లలు సంఖ్య తక్కువగా ఉందన్న కారణంగా చూపి పాఠశాలలను మూసివేయాలనే ఆలోచన వెంటనే విరమించుకోవాలని ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరయ్య, మౌలాలి, జిల్లా కార్యదర్శి జెవిఆర్ ఓ ప్రకటనలో కోరారు.విలీనం పేరుతో పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను సమీపంలోని పాఠశాలకు పంపించి ఇప్పుడు మళ్లీ పిల్లలు తక్కువగా ఉన్నారనన నెపంతో రోలు 10 లోపు ఉన్న పాఠశాలను దగ్గరలోని ఉన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలో కలుపుతామని చెప్పడం ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను గందరగోళానికి గురి చేయడమేనని వారు ఆందోళన వ్యక్తం చేశారు. 10 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల మెర్జింగ్ నిలుపుదల చేయాలని గందరగోళ పరిస్థితులను సరిద్దిదాలని కోరారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

- రూ. 10 లక్షల విలువైన ట్రాక్టర్ ఇంజిన్లు, ట్రాలీలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్ ఇంజన్లు, ట్రాలీలు

ప్రజాశక్తి-పర్చూరు

అంతర్ జిల్లా ట్రాక్టర్ ట్రాలీల దొంగను పట్టుకొని అతని వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన ట్రాక్టర్లు, ట్రాలీలు స్వాధీనం చేసుకున్నట్లు పర్చూరు ఎస్ఐ చెంచు ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఇంజం వెంకట రామాంజనేయరెడ్డి అదే గ్రామానికి చెందిన వెంకటరెడ్డితో కలిసి పగటి పూట ట్రాక్టర్ ట్రాలీల కోసం రెక్కీ నిర్వహిస్తారు. పొలాలు, కొష్టాలు, ఇంటి సమీపంలో నిలిపి ఉంచిన ట్రాలీలను ఎంపిక చేసుకుంటారు. రాత్రి సమయంలో అక్కడి వెళ్లి వాటిని అపహరిస్తారు. అనంతరం ట్రాలీలను తనకు తెలిసిన వ్యక్తుల వద్దకు తీసుకెళ్లి రైతులు అప్పుల్లో ఉన్నారని నమ్మించి వారికి అమ్మి సొమ్ము చేసుకుంటారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి .శ్రీనివాసరావు పర్యవేక్షణలో మార్టూరు సిఐ ఫిరోజ్ ఆధ్వర్యంలో పర్చూరు ఎస్ఐ చెంచు ప్రసాద్ తన సిబ్బందితో కలిసి నిందితుల కోసం ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో పర్చూరు వైజంక్షన్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ట్రాక్టర్‌పై అటువైపుగా వస్తున్న నిందితుడు వెంకటరామాంజనేయరెడ్డి పోలీసులను చూసి పరారీ అయ్యేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. పోలీసులు దర్యాప్తులో తాను ట్రాక్టర్ ట్రాలీల చోరీకి పాల్పడుతున్నట్లు నిందితుడు అంగీకరించారు. మార్కాపురం, పర్చూరు, తాడివారిపల్లి, యద్దనపూడి, కంభం, అర్ధవీడు, కురిచేడు పోలీసు స్టేషన్ల పరిధిలో 6 ట్రాక్టర్ ట్రాలీలు, 2 ట్రాక్టర్ ఇంజన్లను దొంగిలించినట్లు నిందితుడు అంగీకరించాడు. వాటి విలువ రూ. 10 లక్షలు ఉంటుందని ఎస్ఐ చెంచు ప్రసాద్ తెలిపారు.



మృతిచెందిన కార్మికుడు

గ్రానైట్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-గ్రోత్ సెంటర్

ఆర్చ్ అనే పాలిష్ యంత్రం నేమ్ ప్లేట్ పైన పడటంతో ఓ గ్రానైట్ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ లో సోమవారం చోటు చేసుకుంది. మద్దిపాడు ఎస్ఐ శ్రీరామ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు శ్రీపాద్ ప్రహ్లాద్ గవలి (35) బాపట్ల జిల్లా కొరిసపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామంలో నివాస ముంటున్నాడు. సెజ్ పరిధిలోని రేర్ రాక్స్ కంపెనీలో పాలిష్ మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. రోజువారీ లాగే విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో 800 కిలోల బరువు ఉన్న ఆర్చ్ అనే పాలిష్ యంత్రం నేమ్ ప్లేట్ అతనిపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు వెంటనే ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ తరలించారు. అప్పటికే శ్రీ పాద్ ప్రహ్లాద్ గవలి మతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీరామ్ తెలిపారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మాదక ద్రవ్యాల వ్యతిరేక ఉద్యమం

ప్రజాశక్తి-మార్కాపురం

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎంపిజె ఆధ్వర్యంలో వ్యతిరేక ఉద్యమం సోమవారం నుంచి ప్రారంభమైంది.ఈ ఉద్యమం వచ్చే నెల 2 వరకూ కొనసాగనుంది. ఈ మేరకు మార్కాపురం ఇస్లాంపేటలోని సంఘ కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) ఆధ్వర్యంలో 'యువత మేలుకో-భవిష్యత్‌ను మలుచుకో-డ్రగ్స్‌ను వదులుకో' అనే నినాదంతో ఈ ప్రచార ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్ తెలిపారు. యువత బాగు కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంపిజె ముందుంటుందని తెలిపారు. విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులతో చైతన్యం తీసుకురానున్నట్లు తెలిపారు. గెట్ టు గెదర్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలతో పాటు మన రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా సమాజంలో నేరాలు పెరుగుతున్నాయని తెలిపారు. మత్తుకు యువత బానిస కావడమే కాకుండా శారీక, మానసిక రుగ్మతలనుకు గురై ఆత్యహత్యలకు పాల్పడటం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. దేశంలో ప్రతి 20 మందిలో ఒకరు ఆల్కహాల్, ప్రతి 40 మందిలో ఒకరు డ్రగ్స్ లాంటి మత్తుకు బానిసలవుతున్నారన్నారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి యువత బాగు కోసం గత ఎన్నికల ముందు ఇచ్చిన మేరకు మద్య నిషేధం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎంపిజె జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాశిం, జిల్లా నాయకులు పఠాన్ మహబూబ్‌ఖాన్, షేక్ జహీర్‌రాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఆయుబ్ ఖాన్, నాయకులు మీరావలి, రసూల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

22న మండల సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రావూరి జనార్ధన్‌రావు తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- చీరాల

మూడో రైల్వే ట్రాక్ పనుల్లో భాగంగా పురపాలక సంఘం పరిధిలోని మంచి నీటి పైపులైన్లను మార్చాల్సి ఉందని కమిషనర్ ఏసయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా పట్టణంలోని 5 వార్డు 11 నుంచి 22వ వార్డు పరిధిలో ఈనెల 23 నుంచి 25 వరకూ మూడు రోజుల పాటు ఎన్ఆర్ అండ్ పిఎం, గొల్లపాలెంలోని మంచినీటి ట్యాంకుల పరిధిలో మంచినీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం యథావిధిగా మంచినీటిని సరఫరా చేస్తారని తెలిపారు. ఆయా వార్డుల్లోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమతో సహకరించాలని కమిషనర్ కోరారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

చీరాల : చీరాల పట్టణంలోని పలు దేవాయాల్లో సోమవారం అమావాస్య పూజలు నిర్వహించారు. అందులో భాగంగా శివాలయంలో స్వామివారికి విశేష పూజలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని సుందరంగా అలంకరించారు. అదేవిధంగా గడియారస్తంభం కూడలిలోని వీర రాఘవస్వామి దేవస్థానంలో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు.

స్పందనను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ జగన్నాథం పార్థసారథి తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ పార్థసారథి మాట్లాడుతూ వివిధ సమస్యలపై 8 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వాటి పరిష్కారం కోసం అర్జీలను సంబంధిత అధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వలలో చిక్కుకొని మృతిచెందిన వెంకట శ్రీనివాసరావు

వలలో చిక్కుకొని వ్యక్తి మృతి

రేపల్లె : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చేపల వలలో చిక్కుకొని మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని మోర్తోట గ్రామ శివాలయం సమీపంలోని కష్ణ నదిలో సోమవారం చోటుచేసుకుంది. సిఐ విజయచంద్ర వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మోర్తోట గ్రామానికి చెందిన కారాని వెంకట శ్రీనివాసరావు(40) చేపలు వేట కోసం తన భార్య లక్ష్మితో కలసి కృష్ణ నది వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చేపల వలలో చిక్కుకొని మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ విజయచంద్ర తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

మండలపరిధిలోని అమ్మన బ్రోలు గ్రామ పంచా యతీ కార్యాలయంలో గ్రామస్తుల సహకారంతో కిమ్స్ హాస్పిటల్ వైద్యులు సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామాంజ నేయులు, డాక్టర్,ప్రీతి, ఆప్తమాలజిస్ట్ రాణి ఆధ్వర్యంలో 300 మందికి బిపి, షుగర్, ఇసిజి, గుండె సాధారణ వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బత్తుల రవీణ, పిఎసిఎస్ చైర్మన్, మాజీ సర్పంచి కోయి హనుమయ్య, గ్రామ పెద్దలు బత్తుల కొండయ్య ,ఉన్నం. శ్రీను కాట్రగడ్డ శ్రీనివాసరావు, కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు

శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదాయం రూ. 24,80,656

ప్రజాశక్తి-సిఎస్.పురం



ఆలయ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని కోవిలంపాడు మిట్టపాలెంలో వెలసిన శ్రీనారాయణస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.24,80,656 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వ హణాధికారి ఎస్.నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. హుండీ ద్వారా రూ.13,07,529, టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,85,140, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.2,76,105, అన్నదాన విరాళముల ద్వారా రూ .3,65,259, మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.62,927, స్వామి కళ్యాణం సందర్భంగా చదివింపులు ద్వారా రూ.18,000, ఇతర విరాళాలు రూ.1,65,656 కలిపి మొత్తం రూ.24,80,656 ఆదాయం వచ్చినట్లు ఇఒ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, నర్రా నారాయణరెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు8 సహకరించిన గ్రామస్తులకు, అన్ని శాఖల అధికారులు, ఆలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జిఎ.సత్యనారాయణ, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు మంచికంటి మధుసూధన్, మూడుమాల నారాయణరెడ్డి తదితరులు తదతరులు పాల్గొనారు.

పేరుకే 'భరోసా' కేంద్రాలు

- నిరుపయోగంగా డిజిటల్ కియోస్కులు
- రైతులకు తప్పవని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



డిజిటల్ కియోస్క్

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి వారు నాణ్యమైన ఉత్పత్తులు సాధించేందుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్కులు ఏర్పాటు చేశారు. రైతు ఉత్పత్తుల అమ్మకాల కోసం బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దిన డిజిటల్ కియోస్కులు ఏర్పాటు చేశారు. డిజిటల్ కియోస్కల ద్వారా రైతులు తమకు కావాల్సిన వ్యవసాయ ఉత్పాదకాలను తమ గ్రామం నుంచే ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసి పొందవచ్చు. పంట యాజమాన్య పద్ధతులు వీడియో రూపంలో అందుబాటులో ఉంటాయి. బ్యాంకు సేవలు అందుబాటు లోకి వస్తాయి. రైతులు తమ గ్రామానికి దూరంగా ఉన్న బ్యాంకు వెళ్లే పనిలేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారానే సాగుకు అవసరమైన రుణాలు పొందవచ్చు. బ్యాంకులకు సంబంధించి కరస్పాండెంట్లను ఆర్‌బికెల్లో అందుబాటులో ఉండి నగదు చెల్లింపులు చేస్తారు. ఆచరణ ఘనంగా ఉన్నా అమలు నిరుపయోగం మారింది. రైలకు డిజిటల్ కియోస్కులు ఉపయోగపడటం లేదు. జిల్లాలోని 25 మండలాల్లో 410 ఆర్‌బికెలు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు ఆన్‌లైన్ బ్యాంకు సేవలపై అవగాహన కల్పించి వ్యవసాయ సీజన్‌లో కొద్దిపాటి పెట్టుబడి రుణాలు రైతులు పొందేలా చూడాల్సిఉంది. ఆర్‌బికెల్లో బ్యాంకు కరస్పాండెంట్లను నియమించి వారు ప్రతి రోజూ రెండు గంటల పాటు ఆర్‌బికెలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాల్సి ఉంది. ఆర్‌బికె ద్వారా ప్రతి రైతు రూ.20 వేల వరకూ లావాదేవీలు జరుపుకోవచ్చు. బ్యాంకులు లేని అన్ని గ్రామాల్లో డిజిటల్ కియోస్కలను వినియోగంలోకి తెచ్చి బ్యాంకు కరస్పాండెంట్ల ద్వారా రైతులకు మెరుగైన బ్యాంకు సేవలు అందించాలి. గత రెండేళ్లుగా ఆర్‌బికెల ద్వారా బ్యాంకు సేవలు అని చెప్పారే తప్ప ఆచరణలో ఏమి జరుగలేదు. దీంతో సాగు పెట్టుబడి కోసం రైతులు ప్రయివేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. అధిక వడ్డీల కారణంగా రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి డిజిటల్ కియోస్కలను అందుబాటు లోకి తెచ్చి, బ్యాంకు కరస్పాండెంట్లను నియమించి ఆర్‌బికెల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం వారి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ అనే అంశం ఈనెల 19,20 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు,శ్రీ మంతుల లక్ష్మణరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఐసిఆర్ సిఎస్ఇ- 2023పై 19న వర్చువల్ 20న ఆఫ్‌లైన్‌లో సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల నుంచి జాతీయ అంతర్జాతీయ యూనివర్సిటీల నుంచి ప్రముఖ కళాశాలల నుంచి 110కి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. నేటి ఆధునిక ప్రపంచం గ్లోబల్ డిజిటలైజేషన్ వైపు పరుగులు తీస్తుందని, నేడు ప్రతి ఒక్కరి రోజు వారి కార్యక్రమాలపై కూడీఆ ఇంటర్నెట్ ప్రభావాన్ని చూపిస్తుందని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై కంపూటర్ సైన్స్ ఎంతో ప్రభావాన్ని కనపరుస్తుందని. తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం, శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్, సిఎస్ఐ విభాగం, ఎస్‌వి యూనివర్సిటీ కీనోట్‌ను ఈ కాన్ఫరెన్స్‌లో అందజేశారు. ఈ అంతర్జాతీయ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఎ.డబ్లు. ఎస్, క్లౌడ్ కంప్యూటింగ్ మెదలగు ఆధునిక అంశాలపై వివిధ రీసెర్చ్ పేపర్లను సమర్పించినట్లు సిఎస్ఐ విభాగాధిపతి పి. హరిణి తెలిపారు.



అర్జీ దారులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఫిర్యాదు దారులు పట్ల పోలీసు సిబ్బంది సహదయ భావంతో వ్యవహరించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు స్పందన కార్యక్రమంలో తమ సమస్యలను స్వయంగా ఎస్‌పికి వివరించి వినతి పత్రాలు అందజేశారు. ఫిర్యాదు దారుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కారం చూపేలా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కార్యాలయాలకు వస్తుంటారన్నారు. వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించి సహదయ భావంతో వారి సమస్యలను విని పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలన్నారు. చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలు సానుకూలంగా వినాలన్నారు. స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి 34 మంది వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి. మాలకొండయ్య, పోలీసు సిబ్బంది , అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో నాలుగు అర్జీలు

ప్రజాశక్తి -బాపట్ల రూరల్

బాపట్ల తహశీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై నాలుగు అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు కవిత తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆఇ నిరంజన్, ఎస్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా



అర్జీ దారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

స్పందన అర్జీలను గడువు లోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను ప్రభుత్వం విధించిన సమయంలోపు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలపై పదే పదే వచ్చే అర్జీలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మి శివజ్యోతి, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ డిఎస్‌ఎ విలియమ్స్,డిఎం శ్రీలక్ష్మి, డిఎం.అండ్ హెచ్ఓ విజయమ్మ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత జగ్జీవన్‌రామ్

రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు

ప్రజాశక్తి- రేపల్లె



మాట్లాడుతున్న మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె మండలం ఉప్పూడి పంచాయతీ పరిధిలోని ఊలుపాలెంలో ఏర్పాటు చేసిన భారత మాజీ ఉప ప్రధాని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణా రావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోపిదేవి వెంకట రమణారావు మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రతినిధిగా, ఉప ప్రధానిగా, రక్షణ మంత్రిగా పదవులకు వన్నెతెచ్చిన స్ఫూర్తిదాయకమైన నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత అల్లం శెట్టి నరేష్ బాబు, ఎంపిటిసి అల్లం శెట్టి సతీష్ బాబు, సర్పంచి గుజ్జర్లమూడి విజయ బేబి, ఇమ్మానియేల్ భాస్కర్, ఎన్.కిషోర్, పి.సురేష్ బాబు, రాజేశ్వరరావు, జయరావు, హరీష్ బాబు, నీలాంబరం గ్రామ పెద్దలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు బాపట్లలో ఉచిత పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-బాపట్ల



పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

యువతలో మాతభాష పట్ల మక్కువ పెంచి తెలుగు సాహిత్యం రచనా పటిమకు మరింత పదును పెట్టేందుకు పుస్తకపఠనంపై ఆసక్తి కల్పించేందుకు బాపట్లలో మంగళవారం ఉచిత పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ పుస్తక ప్రదర్శనకు బాపట్లకు చెందిన ప్రజా వైద్యులు, కవి డాక్టర్ శ్రీనివాస్ 20 పుస్తకాలను సోమవారం ఉచితంగా అందజేశారు. బాపట్ల జిల్లా రచయితల సంఘం, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్, రసరంజని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పుస్తక ప్రదర్శనకు తమ వంతుగా బుద్ధుడు -బౌద్ధం ఆవశ్యకత అనే అంశంపై డాక్టర్ వై .చైతన్య మురళి రచించిన పుస్తకాలను పుస్తక ప్రదర్శన నిర్వాహాకుల్లో ఒకరైన రసరంజన సంస్థ అధ్యక్షుడు బూర్గుల సంగమేశ్వర శాస్త్రికి డాక్టర్ శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రసార, ప్రచార మాధ్యమాల తాకిడికి ప్రజల్లో పుస్తకాలు చదివే ఆసక్తి సన్నగిల్లుతోంది. తిరిగి పుస్తక పఠనానికి పూర్వ వైభవం కల్పించేందుకు విస్తతంగా పుస్తక ప్రదర్శనలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రసరంజని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల సంగమేశ్వర శాస్త్రి మాట్లాడుతూ ప్రస్తుతం యువత, విద్యార్థులను సోషల్ మీడియా ప్రభావితం చేస్తుందని తెలిపారు. దాని నుంచి దష్టి మరల్చేందుకు పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలు పాఠకులు తమకు నచ్చిన పుస్తకాలను ఉచితంగా తీసుకెళ్లొచ్చన్నారు. తాము చదివిన పుస్తకాలను మరింత మంది పుస్తక ప్రేమికులు చదువుకొనేలా అవకాశం కల్పించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పుస్తక పఠనంతో పాటు భాషా, సాహిత్యం, సంస్కతి పట్ల జాతిని జాగతం చేసి మాతభాష ద్వారా వెలుగులతో కూడిన విజ్ఞానం పెంచే లక్ష్యంతో బాపట్లలో రోటరీ కళ్యాణమండపంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పుస్తక ప్రదర్శనకు తమ వంతు పుస్తకాలను అందించి పదిమంది పుస్తకాలు చదువే అవకాశాన్ని కల్పించి ఉచిత పుస్తక ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. ప్రపంచ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కథా రచనల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన సాహిత్యాభిలాషులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల

సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి సిఐటియు నాయకుల వినతి
- ఆప్కాస్‌లో చేర్చే విషయంపై స్పష్టమైన హామీ ఇచ్చిన బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వ ర్యంలో కార్మికులు స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో 2019 సంవ త్సరంలో కోవిడ్ విధులు నిర్వహించేందుకు కొంతమంది కార్మికులను పనిలోకి తీసుకోవ డం జరిగిందన్నారు. వారు నేటికి కొనసాగు తున్నారని తెలిపారు. అయితే వారిని ఆప్కాస్‌లో చేర్చనందున నిర్ధిష్ట వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే వారిని ఆప్కాస్‌లో చేర్చి, వారికి వేతన సవరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనం ఇప్పించాలని కోరారు. ఆప్కాస్‌లో పనిచేస్తూ చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. అన్ని పారిశుధ్య డివిజన్‌లలో ఆరోగ్యాలు బాగాలేక ఇబ్బందిపడుతున్న కార్మికుల బదులు వారి కుటుంబసభ్యులకు పనిచేసుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అరవై ఏళ్లు పై బడి విధుల నుంచి తొలగించిన వారి స్థానంలో కూడా వారి కుటుంబసభ్యులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈసమస్యల పట్ల బాలినేని శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చే విషయం మున్సిపల్ రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. 60 ఏళ్లు నిండిన కార్మికులు, ఆరోగ్యాలు బాగాలేని కార్మికులు, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులకు పనిచేసుకునే అవకాశం కల్పించాలని ఈపాటికే కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చానని వివరించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో మున్సిపల్ కార్మికులు శశి, పూర్ణ, పద్మ, దివ్య, తదితరులు ఉన్నారు.


బాలినేనికి విన్నవిస్తున్న సిఐటియు నాయకులు

వైభవంగా త్రిపురాంతకేశ్వర రథోత్సవం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

శ్రీ చక్ర త్రిపురాంతకం ప్రముఖ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలో వెలసియున్న త్రిపురాంతకేశ్వర స్వామి, బాలత్రిపుర సుందరీ దేవి అమ్మవారి ఆలయంలో శివరాత్రి మహోత్సవ సందర్భంగా మూడో రోజు సోమవారం అంగరంగ వైభవంగా త్రిపురాంతకేశ్వర రథోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ వి.కిరణ్, త్రిపురాంతకేశ్వర దేవస్థానము ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పబ్బిశెట్టి పద్మజ, మల్లిఖార్జునరావు, ఆలయ అర్చకులు విశ్వం ప్రసాదశర్మ అధ్యర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకిం చేందుకు సుదూర ప్రాంతాల నుండి వినుకొండ, మార్కాపురం, యర్ర గొండపాలెం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. త్రిపురాంతకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాయక్ అధ్యర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

'మన ఊరు-మన ఎమ్మెల్యే'ను

విజయవంతం చేయాలి: బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

'మన ఊరు-మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయాలని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బూచేపల్లి కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జడ్‌పిటిసిలు వేమా శ్రీనివాసరావు, దుంపా రమణమ్మ, వైసిపి మండల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ జ్యేష్ట శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కె.శేఖరరెడ్డి, దుంపా చెంచిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

మద్యం షాపులో రూ.13 లక్షలు స్వాహా.?

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మద్యం షాపుల ఉద్యోగులు అత్యాశకు పోయి ఏకంగా మద్యం లావాదేవీలపై కన్నేశారు. రూ.13 లక్షలు కాజేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. త్రిపురాంతకం మండలంలో గల ఓ మద్యం షాపులో తప్పుడు ఆన్‌లైన్ చూపించి ఒక బ్రాందీ షాపు సిబ్బందితో చేతులు కలిపి.. 'నీకు సగం.. నాకు సగం..' అని డబ్బులను పంచుకున్న తీరు బహిర్గతమైంది. అసలు విషయం తెలిస్తే ఉద్యోగాలు పోతాయని గ్రహించిన సదరు ఉద్యోగులు కొత్త ఎత్తుగడ వేసి పప్పులో కాలేశారు. మద్యం షాపుల వారి నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

త్రిపురాంతకం మండలంలోని ఓ షాపులో పని చేస్తున్న సూపర్ వైజర్ సంబంధిత డిపోలో కట్టవలసిన రూ.13 లక్షల నగదును ఓ డిపో అధికారి భాగస్వామ్యంతో 'నీకింత..నాకింత..' అని పంచేసుకున్నట్లు తెలుస్తుంది. అయితే డబ్బుల గుట్టు రట్టవడంతో ఎలాగైన డిపోలో డబ్బులు కట్టక తప్పదని డిపో నుండి మద్యం సరఫరా అయ్యే షాపులపై ప్రతాపం చూపించారు. మీరు బ్లాకులో పది నుంది ఇరవై రుపాయల వరకు మధ్యాన్ని అమ్ముకోండి మాకు మాత్రం ఒక్కో షాపు నుండి రూ.30 వేలు ఇవ్వాలని ముక్కుపిండి వసూలు చేసినట్టు తెలుస్తోంది. అయితే ఇదే క్రమంలో యర్రగొండపాలెంలోని షాపుల వారి నుండి రూ.30 వేలు డిమాండ్ చేయగా త్రిపురాంతకంలో 'ఎవడో అవినీతి చేస్తే మేమెందుకు ఇవ్వాలి' అని వాదన జరిగింది. మద్యం షాపుల డబ్బులు రూ.13 లక్షలు కాజేసిన వ్యవహారం జిల్లా అధికారులకు తెలియకుండా గుట్టుగా సరిదిద్దుకునేందుకు డిపోలోని ఓ కానిస్టేబుల్ శతవిధాలా ప్రయత్నించడం చర్చాంశనీయంగా మారింది.

పరారీలో సూపర్‌వైజర్

రాజకీయ నాయకుడి హస్తంతో..

మద్యం షాపులలో వసూలైన డబ్బులను కాజేసిన ఒప్పంద ఉద్యోగి, మార్కాపురం మద్యం డిపో కానిస్టేబుల్ స్థానికంగా ఉండే ఓ రాజకీయ నాయకుడిని ఆశ్రయించినట్లు తెలిసింది. ప్రభుత్వ మద్యం షాపులను శాసిస్తున్న స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ఖరీదైన మద్యాన్ని బ్రోకర్ల ద్వారా బ్లాకులో అదనంగా అమ్ముకుంటున్న విషయం తెలిసిందే.. గతంలో యర్రగొండపాలెంలోని ఓ మద్యం షాపు సూపర్‌వైజర్ రూ.13 లక్షలు కాజేసిన విషయం మరవకముందే త్రిపురాంతకంలోని ఓ షాపులో పనిచేసే సూపర్‌వైజర్ డిపో కానిస్టేబుల్‌తో కలిసి రూ.13 లక్షలు దిగమింగినట్లు బహిర్గతమైంది.

పరారీలో సూపర్‌వైజర్!

త్రిపురాంతకం మండలంలోని ఓ మద్యం షాపులో రూ.13 లక్షలు దిగమింగిన ఆ సూపర్‌వైజర్ పరారీలో ఉన్నట్లుగా తెలుస్తోంది. 'నా కొడుకును కాపాడండి.. కేసులు పెట్టొద్దు' అని అతని తల్లి కొంత నగదు చెల్లించింది. మిగతా డబ్బులు కట్టడానికి సిబ్బంది కుస్తీలు పడుతున్నారు.

పేద కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని నల్లబండ బజార్‌లో నివసిస్తున్న దూదేకుల బాల్ సాహెబ్‌కు ఇటీవలే యాక్సిడెంట్ జరిగి కాలు విరిగింది. అప్పు చేసి హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ తీసుకున్నాడు. ఇప్పుడు కాలులో రాడ్ తీయించుకోవడానికి తగిన ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్నారు. ఫాతిమా స్వచ్చంద సేవ సంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాసీంవలిని కలిసి సమస్యను విన్నవించారు. సేవా సంస్థ సభ్యుల సహకారంతో ఖాసింవలీ వైద్యఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో దండు హుస్సేనయ్య నంద్యాల ఖాదర్ బాషా (టీచర్), కే అసేన్ (టీచర్), దూదేకుల దస్తగిరి పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో అథ్లెటిక్స్‌లో రాణించిన 'రజనీస్'

ప్రజాశక్తి-మార్కాపురం

ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కోల్‌కతాలో జరిగిన 43వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో (35 సం॥ విభాగంలో) మార్కాపురంలోని కమలా హైస్కూల్‌కు చెందిన పిఇటి ఎస్.రజనీస్ హై జంప్‌లో 160 సెంటీమీటర్ల పోటీలో మూడో బహుమతి దక్కించుకున్నారు. దీంతో అంతర్జాతీయ స్థాయిలో ఈ ఏడాది నవంబర్‌లో పిలిప్పీన్స్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు రజనీస్‌కు అవకాశం లభించింది. ఈ మేరకు రాష్ట్ర సెక్రటరీ రాం ప్రసాద్, రాష్ట్ర చైర్మన్ రాజు శిఖామణి, జిల్లా సెక్రటరీ శివశంకరరావు, కమలా హైస్కూల్ సిబిఎస్ఇ కరస్పాండెంట్ పెనుగొండ పవన్ కుమార్, ప్రిన్సిపల్ షేక్ ఎస్.ఐ.షరీఫ్ జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచిన రజనీస్‌ను అభినందించారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలో సౌండ్ పొల్యూషన్ ఎక్కువ చేసే ద్విచక్ర వాహనాలను ఎస్ఐ బ్రహ్మ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ప్రజలను సౌండ్ పొల్యూషన్ ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్న 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి.. వాటి సైలెన్సర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సౌండ్స్ ఇచ్చే సైలెన్సర్లతో జనాన్ని ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు.

భోజనం పంపిస్తా..చదువుకోండి..

హాస్టల్ విద్యార్థినులతో వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రభుత్వ కళాశాల ఎస్సీ బాలికల వసతి గహాన్ని సోమవారం రాత్రి కొండపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు సందర్శించారు. ముందుగా హాస్టల్ గదులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి హాస్టల్లో ఉన్న విద్యార్థులతో సమావేశమయ్యారు. ఇక్కడ ఏం జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ప్రైవేటు భవనం అయినందువల్ల వసతులు బాగా లేవని, దాతలతో సమస్య పరిష్కారం చేస్తామన్నారు. హాస్టల్ వార్డెన్, కుక్ మధ్య ఉన్న వివాదంగా ఇక్కడ విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులకు తానే భోజనం పంపించి ఇక్కడ వసతులు కల్పిస్తానని వివరించారు. కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. వీరి వెంట ఎస్సై ఫిరోజా ఫాతిమా తదితరులు ఉన్నారు.


హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

దళిత మహిళలపై దాడి చేసిన

నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పొదిలి మండలం జువ్వలేరులో దళిత మహిళలు తాళ్లూరి భాగ్యమ్మ, గుంటగాని పద్మపై దాడి చేసిన పెత్తందారీ నిందితుల్ని అరెస్టు చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య డిమాండ్ చేశారు. పోలీసులు నిర్లక్ష్యానికి నిరసనగా ఆత్మహత్యాయత్నం చేసి.. ఒంగోలులో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న భాగ్యమ్మను సోమవారం అంజయ్య పరామర్శించారు. అనంతరం అంజయ్య మాట్లాడుతూ శుక్రవారం తమపై జరిగిన దాడి గురించి పొదిలి పోలీసులకు భాగ్యమ్మ, పద్మ ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు స్పందించకపోవడంతో భాగ్యమ్మ తీవ్ర మనస్థాపానికి గురై, ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. పొదుపు డబ్బులు సొంతానికి వాడుకొని సకాలంలో బ్యాంకుకు చెల్లించని గ్రూపు లీడర్ సుమతిని లెక్కలు అడిగిన నేరానికి, సుమతికి సన్నిహితులైన కోటేసు శ్రీను భాగ్యమ్మ, పద్మలపై దాడి చేశారన్నారు. జువ్వలేరు గ్రామంలో శ్రీ స్వయం సహాయక మహిళా గ్రూపు సభ్యురాలైన తాళ్లూరి భాగ్యమ్మ నెలవారీ కడుతున్న అప్పు మరియు పొదుపు నగదును గ్రూపు లీడర్ అయిన రాచపూడి సుమతి సకాలంలో కట్టకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. గ్రూపు సభ్యులు సకాలంలో డబ్బులు కడుతున్నప్పటికీ, లీడర్ సుమతి బ్యాంకులో జమ చేయకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తూ, ఆ డబ్బుని సొంతానికి వాడుకున్నారన్నారు. ఈ క్రమంలో భాగ్యమ్మ పొదుపు లెక్కలు చెప్పాలని లీడర్ సుమతిని కోరడంతో సిరిమల్లె కోటేసు, కసిరెడ్డి శ్రీను భాగ్యమ్మను, భాగ్యమ్మ తల్లి పద్మను నడి బజారులో విచక్షణారహితంగా కొట్టారన్నారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా తీసుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటంతో మనస్తాపానికి గురైన భాగ్యమ్మ హార్పిక్ తాగిందన్నారు. చావుబతుకుల మధ్య రిమ్స్‌లో కొట్టుమిట్టాడుతున్నా ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని అంజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పెత్తందారీ నిందితుల్ని అరెస్టు చేయకుంటే న్యాయం కోసం ఎస్‌పి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బాధిత మహిళను పరామర్శించిన వారిలో దళిత నాయకులు తానికొండ ఆనంద్, మోరపాకుల కష్ణ ఉన్నారు.



ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దామచర్ల సత్య

ప్రసాద్ కుటుంబానికి సత్య పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని పొందూరు గ్రామ టిడిపి నాయకులు, ఒంగోలు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి కీ"శే" కాట్రగడ్డ అనిల్ తండ్రి కాట్రగడ్డ ప్రసాద్ (70) ఆదివారం రాత్రి మతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పొందూరుకు గ్రామానికి విచ్చేశారు. ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన సతీమణికి ధైర్యం చెప్పారు. అనిల్ మతి చెందిన కొద్ది రోజులకే ఆయన తండ్రి కూడా మతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసాద్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-పిసిపల్లి

పేదలకు ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలో గుదేవారిపాలెం గ్రామ పంచాయతీ రామాపురం గ్రామ నివాసులు, పాముల కుటుంబాల వారు సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జిపి.రామారావు, సిపిఐ నాయకులు గుండాబత్తిన రమణయ్య, ఆరెతోటి చిన్నబ్రహ్మయ్య, పోలా యేసురత్నం, పోలా కోటమ్మ, పోలా షకీలా, పోల అబ్రహం, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్య నిర్మాణం కోసం సహకరించాలి

ఎపి సర్పంచ్ సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



పగడాల రమేష్

పల్లె సీమలే పట్టణాలకు పట్టు కొమ్మలు అన్న గాంధీజీ కలుగన్న గ్రామ స్వరాజ్యం నిర్మాణం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనిచ్చి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్ కోరారు. గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీకాలం మూడు వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12,918 మంది గ్రామపంచాయతీ సర్పంచులు, ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నుకోబడి ప్రజాప్రతినిధులయ్యా రన్నారు. కేంద్ర ప్రభుత్వం 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా 12,918 గ్రామ పంచాయతీ సర్పంచులకు పంపిన రూ.8660 కోట్లను సర్పంచుల పిఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమ చెయ్యాలని, గ్రామ సచివాలయాలను సర్పంచుల అధ్వర్యంలోకి తీసుకురావాలని, గతంలో మాదిరే సర్పంచులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, పాత పద్ధతిలోనే పంచాయతీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. సర్పంచులకు, ఎంపీటీసీలకు రూ.15వేల రూపాయలు, ఎంపీపీలకు, జడ్‌టిసిలకు, రూ.30 వేల గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-దరిశి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జిఎల్‌వి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న కాలేజి విద్యార్థుల హాస్టల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హక్కులు, బాధ్యతలు, విధులు గురించి తెలుసుకోవాలన్నారు. అందరు సమానత్వంతో మెలగాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, కులమత భేదాలు లేకుండా ఉండాలన్నారు. కార్యక్రమానికి సంఘ సేవకులు జీవిరత్నం అధ్యక్షత వహించగా న్యాయవాది సుబ్బారెడ్డి, హాస్టల్ వార్డెన్ జనార్ధన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శిలో వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి-దరిశి



రథోత్సవంలో పాల్గొన్న బూచేపల్లి వెంకాయమ్మ

మహాశివరాత్రి సందర్భంగా దర్శిలో శివాలయం ఆధ్వర్యంలో రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటలకు రథోత్సవ ప్రారంభంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక శాసనసభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్, మాజీ శాసనసభ్యులు నారపశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ నారపశెట్టి శివప్రసాద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రథోత్సవం సందర్భంగా మేళతాళాలు, వివిధ రకాల వేషధారణలు, కోలాటం వంటి కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి. దరిశి శివాలయం వద్ద నుండి ఊరేగింపుగా పెద్దఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. శివాలయం వద్ద నుండి గడియార స్తంభం సెంటర్ వరకు.. అక్కడ నుండి పొట్టిశ్రీరాములు వీధి మీదుగా మెయిన్ బజారున శివాలయం వరకు రథోత్సవం జరిగింది. ముందు పూజా కార్యక్రమాలు జరగ్గా అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో సిఐ రామకోటయ్య, ఎస్ఐ రామకృష్ణ పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందాం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

సిఐటియు పిలుపు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

మార్చి 13న జరిగే శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.బాబురెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి గెలుపునకు కృషి చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు, ప్రజాసంఘాల నాయకుల సమావేశం డి.మూర్తి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టి.ఆవులయ్య మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసమస్యల పోరాటం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జివిపిఎస్ జిల్లా కార్యదర్శి టి.తిరుపతిరావు మాట్లాడుతూ శాసనమండలికి మేధావులను పంపిస్తే ప్రజాసమస్యలపై మాట్లాడి పోరాడతారన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు బి.నరసింహులు, డి.థామస్, బి.శ్రీనివాసులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-దరిశి

రైతులు మినుములో యాజమాన్య పద్ధతులు అవలంబించి.. అధిక దిగుబడులు సాధించాలని కీటక విభాగపు శాస్త్రవేత్త ఎం.జాహ్నవి అన్నారు. సోమవారం మండలంలోని శామంతపూడిలో ఆమె మినుము పంటను రైతులతో కలిసి పరిశీలించారు. మినుములో బూడిద తెగులు ఉందని, గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వస్తుందన్నారు. దీని నివారణకు ఎక్సోకోనిజోల్ 50 శాతం, ప్రొపికోనజోల్ 25 శాతం ఇసిని ఒక లీటరు నీటిలో 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలన్నారు.

రాయితీపై సమీకృత పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-కనిగిరి

మండలంలోని పశుపోషకులు ప్రభుత్వం రాయితీపై అందించే సమీకృత పశుదాణాను సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి మండల పశువైద్యులు డాక్టర్ బత్తుల బాలకృష్ణ తెలియజేశారు. మండలంలోని చిన అలవలపాడు, పోలవరం, చీర్లదిన్నె, వంగపాడు, గురువాజిపేట, బడుగులేరు, చల్లగిరగల, చినఇర్లపాడు, ఎన్ గొల్లపల్లి గ్రామాలకు చెందిన పశుపోషకులకు సమీకృత పశుదాణాను ఆయన పంపిణీ చేశారు. కేజి పశుదాణా ధర రూ.15 కాగా రాయితీపై రూ.6.50కు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమీకృత పశుదాణాను వినియోగించటం ద్వారా పాలదిగుబడి పెరుగుతుందని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన భూమికి హద్దులు చూపాలి

సిపిఎం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

రాచర్ల మండలం, పాలకవీడు గ్రామంలో ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ ద్వారా 16 మందికి ఇచ్చిన భూమిని వెంటనే వారికి అప్పచెప్పాలని సిపిఎం నాయకులు డి.తామస్, టి.ఆవులయ్య రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. 2013 డిసెంబరులో సర్వేనెంబర్ 436లో ప్రభుత్వం 16 మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసింది. పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి దాదాపు తొమ్మిది సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ లబ్ధిదారులతో ఖర్చు పెట్టించి.. భూమి చదును చేశాక రెవెన్యూ అధికారులు సమగ్ర భూ సర్వే పనిలో ఉన్నామంటూ భూమి హద్దులు చూపకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. వెంటనే భూమి హద్దులు చూపించాలని, లేనియెడల లబ్ధిదారులతో రెవెన్యూ కార్యాలయం ముందు సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరవధిక ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

చలమారావు గౌడ్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కీర్తిశేషులు దొంతా చలమారావు గౌడ్ సేవలు మరువలేనివని ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ అన్నారు. దొంతా చలమారావు గౌడ్ 71వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి యర్రగొండపాలెంలోని రెయినో బో హైస్కూల్‌లో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ పూలమాలలు వేసి... ఘనంగా నివాళులర్పించారు. చలమారావు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉన్నతమైన విద్యతో పాటు పలు సేవా కార్యక్రమాలు ఈ మారుమూల ప్రాంతాల్లో అందిస్తున్నామని తెలిపారు. తమ తండ్రి చలమారావు గౌడ్ ఆశయాలను ఎల్లపుడూ కొనసాగిస్తామని చెప్పారు. పాఠశాల కరెస్పాండెంట్ కిషోర్ గౌడ్ విద్యార్థులకు స్వీట్స్ పంచి పెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దొంతా నిఖిల కిరణ్ గౌడ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిలో ట్రాఫిక్ సమస్య తీవ్రం

- పగలు సరుకుల అన్‌లోడింగ్‌తో సమస్య జటిలం - ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికార గణం

ప్రజాశక్తి-కనిగిరి



రోడ్డుపై పగలు అన్‌లోడింగ్‌తో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య

కనిగిరి మండల స్థాయి నుంచి రెవెన్యూ డివిజనల్ స్థాయికి పెరిగినప్పటికీ కనిగిరిలో ఏళ్ల తరబడి నెలకొన్న ట్రాఫిక్ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ సెంటర్, బొడ్డు చావిడి సెంటర్, నాజ్‌సెంటర్, గార్లపేట రోడ్, ఉప్పురోడ్, ఎంఎస్ఆర్ రోడ్డు, కపిల సెంటర్, కందుకూర్ రోడ్, తీగల గొంది, చెప్పుల బజార్, శ్రీనివాస థియేటర్ సెంటర్, వైఎస్ఆర్ రోడ్, పామూరు రోడ్ తదితర ప్రాంతాలలో వ్యాపార సముదాయ దుకాణాలు, హాస్పిటళ్లు, పాఠశాలలు అధికంగా ఉన్నాయి. దీంతో నిత్యం ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. నాజ్ సెంటర్‌లో ఉదయం పూట భవన నిర్మాణ కార్మికులు, ఎంఎస్ఆర్ రోడ్డులో సాయంత్రం ఉద్యోగులు అధికంగా గుంపులుగా గుమిగూడి ఉండటం, తమ వాహనాలను రోడ్డుపై వదలి పెట్టటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. అసలే ఇరుకు రోడ్లు కావటం, విస్తరణకు నోచుకోకపోవటంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నోచుకోకుండా పోయింది. వ్యాపార సముదాయాలకు సంబంధించిన సరుకుల అన్‌లోడింగ్ రాత్రి వేళల్లో చేసుకున్నట్లైతే ట్రాఫిక్ సమస్య తలెత్తదు. అలాకాకుండా పగలు పూట ఇరుకురోడ్లలో భారీ వాహనాలు నిలిపివేయటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒంగోలు బస్టాండ్ సెంటర్ నుంచి బొడ్డుచావిడి సెంటర్ వరకు, నాజ్ సెంటర్ నుంచి సూరాపాపిరెడ్డి చౌక్ సెంటర్ వరకు సిసి రోడ్లు వేశారు. బొడ్డుచావిడి సెంటర్ నుంచి నాజ్ సెంటర్ వరకు రోడ్డు మంజూరు అయినప్పటికీ నిర్మాణానికి నోచుకోలేదు. ఒంగోలు బస్టాండ్ సెంటర్ నుంచి బొడ్డుచావిడి సెంటర్ వరకు విస్తరణ చేపట్టకుండానే రోడ్డు నిర్మాణం చేశారు. బొడ్డుచావిడి సెంటర్ నుంచి నాజ్ సెంటర్‌వరకు విస్తరణ జరగలేదు. రోడ్డు నిర్మాణం జరగలేదు. రాజకీయంగా నష్టం జరుగుతుందనే ఈ రోడ్డు నిర్మాణం జరగలేదు. మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పలుమార్లు సమావేశాలు నిర్వహించటం తప్ప తగు చర్యలు చేపట్టకపోవటం విచారకరం. నిబంధనలకు విరుద్ధంగా పగలు సరుకులను అన్‌లోడింగ్ చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జాతి వికాసానికి మాతృభాషే మూలం

ప్రజాశక్తి- బాపట్ల

జాతి వికాసానికైనా మాతభాషే మూలమని బాపట్ల డివిజన్ అభివద్ధి అధికారి సిహెచ్.సువార్త తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాతభాష ఉద్యమ నేపథ్యంలో బంగ్లాదేశ్ రచయిత అనిసుద్ధమాన్ రాసిన కథానిక 'చూపు', ఫోరం ఫర్ బెటర్ బాపట్ల వెలుగులోకి తెచ్చిన కథానికను డిడిఎ ను సువార్త సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సువార్త మాట్లాడుతూ మాతభాష అంతరిస్తే మానవ మునుగడే



కథానిక ప్రతులు ఆవిష్కరిస్తున్న సువార్త

ప్రశ్నార్థకం అవుతుందన్మారు.మాతభాషలు ఉనికిని కోల్పోతే, ఆ జాతి సంస్కృతి సంప్రదాయాలు మరుగున పడిపోతాయన్నారు. భాషా సౌందర్య సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా మాతభాష కోసం నలుగురు ఉద్యమకారులు ప్రాణాలర్పించినట్లు తెలిపారు. భాషా చరిత్రలో ఇది అరుదైన ఘటన అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పిసి.సాయిబాబు, రేపల్లె డివిజన్ అభివద్ధి అధికారి పి. బాలమ్మ, చీరాల అభివద్ధి అధికారి ఎస్. రాజేష్ పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలో చేర్పించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి- సంతమాగులూరు

బడి బయట ఉన్న పిల్లల వివరాలను వాలంటరీల ద్వారా సేకరించి వారు ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ సాంబశివరావు తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులకు నాన్ అకాడమిక్ పనుల నిర్వహణ, పర్యవేక్షణపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ వేమవరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు, మరుగు దొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కానిసిస్ టెంట్ రిథమ్



మాట్లాడుతున్న ఎంపిడిఒ సాంబశివరావు

యాప్‌లో టికెట్స్ సకాలంలో పరిష్కరిం చాలన్నారు. పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేసి వారు ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం డి.మస్తాన్ రావు, ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, దారా బాలయ్య, ఆనంద్ కుమార్, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : మోపిదేవి

ప్రజాశక్తి - నిజాంపట్నం

ప్రజా సంక్షేమమే సిఎం జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో సర్పంచి రవి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమలో



గడప గడపకూలో మోపిదేవి వెంకట రమణారావు

సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మోపిదేవి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.అనంతరం మోపిదేవి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మోపిదేవి హరనాథ్ బాబు, జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య, ఎంపిడిఒ ఎన్.నాగలక్ష్మి, ఎంపిటిసిలు నాజర్ ఖాన్, ఎల్ఎస్అర్, గోపాలకష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బాపట్ల రూరల్

గ్రామాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండల పరిధిలోని నరసాయపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటిం టికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను తెచ్చి ప్రజల ముందుకు పరిపాలన తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఏకగ్రీవమైన పంచాయతీలకు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

రూ.5 లక్షలు అందించి వాటిని అభివద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకష్ణ,,గ్రామ సర్పంచి హైమావతి, సుదర్శన్ బాబు ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-అద్దంకి

స్పందన స్ఫూర్తి ఫైనాన్షి యల్ లిమిటెడ్ వారు సిఎస్ఆర్ ప్రాజెక్టు ద్వారా మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ వారి సౌజన్యంతో ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కార్య క్రమాన్ని నిర్వహిం చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సరిఫికెట్లు మరియు ప్రోత్సాహక కిట్లు సోమవారం పంపిణీ చేశారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ క్లస్టర్ మేనేజర్ లక్ష్మినరసింహారావు, సిఎస్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, మిత్ర మోలిస్టిక్ హెల్త్ సొసైటీ డైరెక్టర్ లక్ష్మి రెడ్డి చేతులు మీదుగా సరిఫికెట్లు, ప్రోత్సాహక కిట్లను పంపిణీ చేశారు. ఈ



సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

సందర్భంగా స్పందన క్లస్టర్ మేనేజర్ లక్ష్మి నరసింహారావు మాట్లాడుతూ అద్దంకి పరిసర ప్రాంతాల్లో ఆసక్తి గల మహిళలు ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిత్ర సంస్థ డైరెక్టర్ లక్ష్మీ ఒడ్డి మాట్లాడుతూ పేద మధ్య తరగతి మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.



దాణామృతం అందజేస్తున్న బేబిరాణి

సబ్సిడీపై దాణామృతం పంపిణీ

ప్రజాశక్తి- మద్దిపాడు

60 శాతం సబ్సిడీపై అందజేస్తున్న దాణామృతాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబి రాణి తెలిపారు. మండల పరిధిలోని దొడ్డవరప్పాడు లోని పశువైద్య కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దాణా మతాన్ని గ్రామానికి చెందిన పశు పోషకులు నాగినేని ఆంజనేయులుకు అందజేశారు. రూ.395 రూపాలయ విలువైన 25 కిలోల దాణా బస్తాను 60 శాతం సబ్సిడీ పోనూ 162-50 అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యురాలు డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి-పిసిపల్లి

పిసిపల్లి ఎంఇఒగా విధులు నిర్వహిస్తూ కనిగిరికి బదిలీపై వెళు న్న ఎంఇఒ జె.ప్రసాద రావును సోమ వారం సన్మానించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎ.పోతులూరయ్య మాట్లా డుతూ



ఎంఇఒను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఎంఇఒ ప్రసాదరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పని చేసేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిసిపల్లి పూర్వ ఎంఇఒ ఆర్.శ్రీనివాసులు, యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఏసుబాబు, సిహెచ్.రమేష్, ఆర్.వేణుగోపాల్, వై.శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిఎంగా మోహన్‌రావు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్



ఇంకొల్లు ఎపిఎంగా తేళ్ళ మోహన్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎపిఎంగా పని చేసిన ఎం.కరుణాకర్ పర్చూరు నియోజకవర్గ స్త్రీనిధి మేనేజర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. ఆయన స్థానంలో బాపట్ల ఎపిఎంగా పనిచేస్తున్న మోహన్‌రావు ఇక్కడ విధుల్లో చేరారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

హుండీ ఆదాయం రూ. 10,23,927

ప్రజాశక్తి - రేపల్లె

మహా శివరాత్రి సందర్భంగా అరవపల్లి బాలకోటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.10,23,927 వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇఒ రాజేశ్వరరావు తెలిపారు. అరవపల్లి బాలకోటేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఇఒ రాజేశ్వరరావు మాట్లాడుతూ హుండీ ద్వారా రూ.4,97,217, దర్శన టిక్కెట్లు ద్వారా రూ.1,47,730, కేశ ఖండనం ద్వారా రూ.580, అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.1,47,000, ప్రసాదాల అమ్మకాల ద్వారా రూ.1,89,200, కొబ్బరిచిప్పల ద్వారా రూ.35,000, నెయ్యి అమ్మకం ద్వారా రూ.7,200, ఇతర రుసుంల ద్వారా రూ.7,200 కలిపి మొత్తం రూ.10,23,927 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గతేడాఇది రూ.10,00,681 ఆదాయం రాగా అదనంగా రూ.23,246 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇఒలు, గ్రామపెద్దలు, ఆయల సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

తారకరత్న చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి-రేపల్లె

సినీ నటుడు నందమూరి తారకరత్న చిత్రపటానికి టిడిపి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళు లర్పించిన వారిలో టిడిపి 14వ వార్డు కౌన్సిలర్ అన్నే రామకష్ణ, నాయకులు జివి. నాగేశ్వరరావు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, పి. మల్లికార్జున రావు, అజయ్ కుమార్, వెనిగళ్ళ శివ సుబ్రహ్మణ్యం, కొలసాని రాము, కమతం శివ, ఖాదర్ బాషా, ఆలూరు సురేష్ భీమ శంకరరావు ఉన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

ప్రజాశక్తి-కొమరోలు

మండల పరిధిలోని రాజుపాలెం తిప్పల వద్ద మట్టి మాఫియా రెచ్చిపోయింది. జెసిబి సహాయంతో మట్టిని తవ్వి టాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అధికారులకు ఆదివారం సెలవు కావడంతో ఇదే అదనుగా భావించిన మట్టి మాఫియా ఇష్టానుసారంగా మట్టిని తరలించారు. ఈ విషయంపై ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి మాఫియాపై చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీ ఓటర్లను తొలగించేందుకు చర్యలు

రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించిన జేసీ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో నకిలీ ఓటర్లు, డూప్లికేట్ ఓటర్లను గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు జెసి ఎం.అభిషిక్త్ కిషోర్ తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లా కలెక్టర్లతో సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో చేపడుతున్న చర్యలను సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. నకిలీ ఓటర్లు, డూప్లికేట్లను గుర్తించి పరిశీలన చేసి వాటిని తొలగించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసిసి బందాలకు వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా దష్టి పెట్టామన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి.చినఓబులేసు, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డి, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, సందీప్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో

విద్యారంగం నిర్వీర్యం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి విమర్శ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న రాష్ట్రప్రభుత్వ విధానాలను నిరసించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో జి.రమేష్ అధ్యక్షతన సోమవారం ఒంగోలు నియోజకవర్గ సిపిఎం ప్లీనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా 7727 ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తోందన్నారు. 12,386 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారుతున్నాయన్నారు. విద్యార్థుల సంఖ్య లేదనే సాకుతో 3000 ప్రాథమిక పాఠశాలలు మూత, విలీనానికి గురయ్యాయని తెలిపారు. 8764 సెకండరీ గ్రేడ్ పోస్టులను రద్దు చేశారన్నారు. ఉన్నత పాఠశాలలో ఒకే మీడియం పెట్టడంతో వేలాది స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రద్దయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఒక్క డిఎస్‌సి వేయలేదని, హైస్కూల్, కస్తూరిబా పాఠశాలల్లో జూనియర్ ఇంటర్ ప్రారంభించినప్పటికీ లెక్చరర్ పోస్టులు ఇవ్వలేదన్నారు. తెలుగు మీడియం రద్దుచేసి బలవంతంగా ఇంగ్లీష్ మీడియంలో రుద్దుతున్నారన్నారు. ఇలాంటి అస్తవ్యస్త విధానాలతో విద్యారంగాన్ని భ్రష్టుపట్టించి, విద్యారంగంలో సంస్కరణలు తెచ్చి బలోపేతం చేశామని వైసిపి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యారంగాన్ని బలహీనపరిచే విధానాలను వ్యతిరేకించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, పౌర సమాజానికి పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, కొత్తపట్నం మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రమాదేవి పాల్గొన్నారు.

ఏరువాక కేంద్రం తరలింపును నిలిపేయాలి

కలెక్టరేట్ వద్ద ఎస్‌కెఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న చుండూరి రంగారావు

ఏరువాక కేంద్రం తరలింపును నిలుపుదల చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు డిమాండ్ చేశారు. ఏరువాక కేంద్రాన్ని తరలించటాన్ని ఖండిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా భౌగోళికంగా, భూసారపరంగా, వాతావరణపరంగా వైవిధ్యంతో పాటు రాష్ట్రంలో అతిపెద్ద జిల్లాగా ఉందన్నారు. వాణిజ్య పంటలలో పొగాకు సాగుతో కేంద్ర ప్రభుత్వానికి ఎక్సైజ్ సుంకం రూపంలో కేంద్రానికి ఆదాయం వస్తుందన్నారు. జిల్లాలో చీమకుర్తి కొండలకు పశ్చిమ భాగం భూసారం, వాతావరణం సంటల సాగు - తూర్పు ప్రాంతంతో పోలిస్తే చాలా భిన్నమన్నారు. దర్శిలో కృషి విజ్ఞాన కేంద్రంద ఉందనే నెపంచూపి ఒంగోలులోని' డాట్ సెంటర్ - ఏరువాకను తరలిస్తూ జీవో ఇవ్వడం, దీన్ని నర్సరావుపేట పల్నాడు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయబూనుకోవడం ప్రకాశం జిల్లా తూర్పు ప్రాంత వ్యవసాయదారులకు, సాంకేతిక సలహాలు, యాజమాన్య మెళకువలు, చీడ పీడల నివారణకు అవసరమైన సంప్రదింపులకు దూరం చేయడమే అవుతుందన్నారు. జిల్లాలోని రైతుల ప్రయోజనాలు కాపాడి డాట్ సెంటర్ - ఏరువాక కేంద్ర తరలింపు నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె మాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వడ్డె హనుమారెడ్డి, ధూళిపాళ్ళ వీరనారాయణ, జామాయిల్, సుబాబుల్ రైతు సంఘం నాయకులు కె.వీరారెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు మండవ శ్రీనివాసరావు, పివిఆర్ చౌదరి, తెలుగు రైతు నాయకులు పోలవరపు వెంకట్రామయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం నాయకులు ఎంఎస్ సాయి, విప్లవ యువజన సంఘం నాయకులు బి.సుబ్బారావు పాల్గొన్నారు.

నకిలీ ఓటర్లపై వెంటనే విచారించాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు

శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓటర్లను జిల్లా ఎన్నికల అధికారులు తక్షణమే విచారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనన్ ఆదేశించారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓట్లు, ఒకే వ్యక్తి పేర్లు జాబితాలో రెండుచోట్ల నమోదైతే వాటిని విచారించి తొలగించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయాలన్నారు. అలాగే బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటర్లను ఎంపిక చేయాలన్నారు. బ్యాలెట్ పత్రాలు పింక్ కలర్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 23న అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా హైకోర్టు కేసుల్లో ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత దస్త్రాలు పున్ణపరిశీలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల సర్వీస్ సర్టిఫికెట్ల జారీపై అధికారులు దష్టి సారించాలన్నారు.

బాపట్ల జిల్లాలో డూప్లికేట్ ఓటర్లను గుర్తించి విచారణ చేపడుతున్నామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ కె.శ్రీనివాసులు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి దష్టికి తీసుకువెళ్లారు. ఉపాధ్యాయ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఒకటి డబుల్ ఎంట్రీ కాగా, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించిన జాబితాలో ముగ్గురికి వయస్సు అధికంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేస్తున్నామని వివరించారు. సమావేశంలో డిఆర్ఒ కె.లక్ష్మీశివజ్యోతి పాల్గొన్నారు.

23న జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శన

బాపట్ల డిఇఒ రామారావు

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న డిఇఒ రామారావు

బాపట్ల జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 23న బాపట్ల పబ్లిక్ స్కూల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు తెలిపారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మండల స్థాయిలో ఎంపిక చేసిన 5 ప్రాజెక్టులతో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. జిల్లాలో 25 మండలాల నుండి ఎంపిక చేసిన 125 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఒకరోజు నిర్వహించే విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు ప్రదర్శన ప్రారంభ, ముగింపు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాల విద్యార్థులు ప్రదర్శన తిలకించేందుకు అనుమతిచ్చామన్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ ప్రదర్శన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పది కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వివిధ విభాగాలకు చెందిన బాధ్యతలను ఆయా కమిటీలు పర్యవేక్షిస్తాయన్నారు. ఉత్తమ ప్రాజెక్టుల ఎంపికకు బాపట్ల ఆహార విజ్ఞాన కళాశాల, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు ఉత్తమ ప్రాజెక్టుల ఎంపిక న్యాయం నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రదర్శనలో ప్రధానంగా ఎకో ఫ్రెండ్లీ, హెల్త్ క్లీన్ నెస్, సాఫ్ట్ వేర్ యాక్సిస్, వాతావరణ మార్పులు, మ్యాథమెటిక్స్ మెథడ్ అంశాలతో కూడిన ప్రదర్శనలను విద్యార్థులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రదర్శనలు రాష్ట్ర స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికవుతాయన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనలు జాతీయస్థాయికి వెళతాయన్నారు. సమావేశంలో డిప్యూటీ డిఈఓ జి.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యావైజ్ఞానిక అధికారి సాదిక్ మాస్టారు పాల్గొన్నారు.

కు.ని. చేయబోయి

యూరినరీ బ్లాడర్ కత్తిరించారు..

బాపట్ల ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



ఆసుపత్రిలో ఉన్న బాధిత మహిళ

బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ తీవ్ర ఇబ్బంది పడుతోంది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసే నేపథ్యంలో యూరిన్ బ్లాడర్ కత్తిరించడంతో అవస్థలు పడుతోంది. చీరాల మండలం, కావూరివారిపాలెంకు చెందిన తాళ్లూరి శ్రావణి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. ఈ క్రమంలో వైద్యులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తూ.. యూరిన్ బ్లాడర్ కట్ చేశారు. ఈ విషయం పేషెంట్‌కు గానీ వారి బంధువులకు గానీ చెప్పకుండా దాదాపుగా 15 రోజుల నుంచి హాస్పిటల్లో ఉంచి గోప్యంగా వైద్యం అందిస్తున్నారు. ఈ విషయం తెలియని బాధితురాలు వైద్యం చేయించుకుంటూనే ఉంది. తరువాత వారి కుటుంబసభ్యులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటే రెండు, మూడు రోజుల్లో ఇంటికి పంపించాలిగా.. ఇదేమిటి ఇన్ని రోజులు ఉంచారని ఆరా తీయగా యూరినరీ బ్లాడర్ కట్ అయ్యిందని తెలియడంతో బాధిత మహిళ కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.